

# హైదరాబాద్ వార్త

# రక్తం మరిగిన జాగిలాలు

- ఫీవర్ ఆస్పత్రికి ప్రతిరోజూ 140 కుక్కకాటు బాధితులు
- ఫలితమివ్వని సంతాన నియంత్రణ చర్యలు
- గణనీయంగా పెరుగుతున్న వీధికుక్కల సంఖ్య
- దాడి చేస్తుండడంతో ప్రజల భయాందోళన
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీహెచ్ఎంసి





**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త**

పిల్లలను పనిమీద బయటికి పంపించాలంటే భయం.. ఏ కుక్క ఎటునుంచి దూసుకొస్తుందోనని... సరదాగా ఆడుకోవడానికి ఇంటి ముందు ఉన్నా ఆందోళనే ఎగబడి ప్రాణాలు తీస్తాయేమోనని... పెద్దలైనా ఒంటరిగా అడుగు పెట్టాలన్నా తడబాటే. ఏ శునకం వెంటపడి గాయపరుస్తుందోనని.. ఇటీవల నగరంలో వీధికుక్కల దాడులు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మహానగరంలో వీధి కుక్కల నియంత్రణను జీహెచ్ఎంసీ గాలికొదిలేసింది. పెంపుడు కుక్కల విషయంలోనూ నిబంధనల అమలును పట్టించుకోవడం లేదు. దీంతో గ్రేటర్‌లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కల దాడులతో ప్రజలు భయపడుతున్నారు. సంఘటన జరిగినప్పుడు హడావిడి చేసే యంత్రాంగం తర్వాత షరా మామూలుగా వ్యవహరిస్తోంది. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి ప్రతి రోజు 140 నుండి 160 మంది కుక్కకాటు బాధితులు టీకాల కోసం వస్తున్నారంటే నగరంలో కుక్కల బెడద ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీధి కుక్కల నియంత్రణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్ పేరిట హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారలేదు. సర్కిల్‌కు ఒకటి చొప్పున డాగ్ క్యాచ్ బృందం, వాహనం ఏర్పాటు చేసినా.. కుక్క కాటు కేసులు తగ్గడం లేదు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, నారాయణగూడలోని ఐపీఎంలో నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనం. ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ కుక్కకాటు బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నగరంలోని ప్రతి నాలుగు వీధి కుక్కల్లో ఒకటి స్టెరిలైజేషన్ జరగనిది ఉండడం గమనార్హం. అనధికారికంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. నగరంలో 5.8 లక్షల కుక్కలు ఉన్నట్టు బల్దియా చెబుతోంది. వీటివల్ల జరిగిన సంతానోత్పత్తితో నగరంలో ప్రస్తుతం కుక్కల సంఖ్య మరో రెండు లక్షల వరకు అదనంగా పెరిగింది. బెంగళూరు, పుణే, ఇండోర్ తదితర నగరాల్లో వీధి కుక్కల సమస్యను ఆయా నగరపాలక సంస్థలు దీటుగా ఎదుర్కొన్నాయి. ఆడకుక్కలు గర్భం దాల్చే సీజన్ మొదలవకముందే వాటికి పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్సలు చేశారు. ఫలితంగా శునకాల సంతతి ఆయా నగరాల్లో అదుపులోకి వచ్చింది.

నగరంలో పెంపుడు కుక్కలు 75 వేల వరకు ఉంటాయని పాత జీహెచ్ఎంసీ విస్తీర్ణం పరిధిలోని అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా ఆ సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. మెజార్టీ పెంపుడు కుక్కలకు లైసెన్స్ లేదు. కొందరు యజమానుల నిర్లక్ష్యంతో పెంపుడు కుక్కల వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అత్తాపూర్‌లోని హైదర్‌గూడ కృష్ణానగర్‌లో ఓ పెంపుడు కుక్క నెల రోజుల్లో ఏడుగురు చిన్నారులను కరిచింది. దీంతో కాలనీవాసులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతానికి వెళ్లిన డాగ్ క్యాచర్ టీం.. ఆ కుక్కను పట్టుకొని అక్కడే వదిలేశారు. అదేంటని ఫిర్యాదుదారులు అడిగితే.. పెంపుడు కుక్కలను తీసుకురావద్దని మా సార్ చెప్పారని సిబ్బంది అనడం గమనార్హం. బల్దియా చట్టం ప్రకారం పెంపుడు కుక్కను నియంత్రణలో పెట్టకుండా.. ఇతరులను కరిస్తే యజమానులకు జరిమానా విధించవచ్చు. ఈ విషయం కూడా జీహెచ్ఎంసీ పట్టించుకోకపోవడం గమనార్హం. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా ప్రయోగాత్మకంగా దత్తత కార్యక్రమానికి జీహెచ్ఎంసీ ఇటీవల శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు కేబీఆర్ పార్కులో కార్యక్రమం నిర్వహించగా.. వందకు పైగా వీధి కుక్కలను ఆసక్తిఉన్నవారికి దత్తత ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. కుక్కల నియంత్రణకు ఏటా రూ.10 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారు. ఫిర్యాదుల ఆధారంగా వీధి కుక్కలను పట్టుకోవడం, వాటికి స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేసే బాధ్యతను జోన్లవారీగా స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. ఒక్కో కుక్కకు జీహెచ్ఎంసీ రూ.1,500 చెల్లిస్తోంది. అయినా కుక్కల నియంత్రణ జరగకపోగా.. క్రమేణా పెరుగుతుండడం గమనార్హం.

**కుక్క కరిస్తే ఏం చేయాలి?**

రేబిస్ సోకిన కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా గాయాన్ని పది నిమిషాలపాటు సబ్బుతో కడగాలి వెంటనే వైద్యులను సంప్రదించాలి. కరిచిన కుక్కను గమనించాలి. రెండు, మూడు రోజుల్లో అది చనిపోతే తప్పకుండా రేబిస్‌ఉన్నట్లే ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ అందిస్తారు. కుక్క కరిచిన రోజుతోపాటు 3, 7, 14, 28వ రోజు ఇంజక్షన్లు ఇస్తారు. లోతైన గాయాలు ఉంటే వ్యాక్సిన్‌తో పాటు ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజక్షన్ కూడా తీసుకోవాలి. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, నారాయణగూడలోని ఐపీఎంలో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

# నగరానికి చలి జ్వరం..!



- ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే చాలు.. అందరినీ చుట్టుముట్టేస్తోంది
- వాతావరణ మార్పులతో పీడిస్తున్న వ్యాధులు
- విషజ్వరాలతో పాటు దగ్గు, జలుబు, శ్వాస సమస్యలు
- ఫీవర్, నీలోఫర్, ఉస్మానియా, గాంధీలో పెరిగిన రోగులు

**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త**

జ్వరమొచ్చింది...వారం రోజుల నుంచి ఎవరి నోటవిన్నా ఇదే మాట. వాతావరణంలో మార్పులు.. చలివల్ల నగరంలో మళ్లీ జ్వరాల తీవ్రత పెరిగింది. విషజ్వరాలతో పాటు దగ్గు, జలుబు, ఇతర శ్వాస సంబంధ సమస్యలతో జనం సతమతం అవుతున్నారు. ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ హాస్పిటల్స్‌కు క్యూకడుతున్నారు బాధితులు. సీజనల్ జ్వరాలని లైట్ తీసుకునే పరిస్థితి లేదు. ఏ ఆస్పత్రిలో చూసినా పెద్ద సంఖ్యలో ఔట్‌పేషెంట్లు కనిపిస్తున్నారు. ఇన్‌పేషెంట్లుఆ చేరి చికిత్స పొందాల్సిన వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. మళ్లీ చికెన్ గున్యా, డెంగీ కేసులు పెరుగుతున్నాయంటున్నారు. ఇక్కడా, అక్కడా అని తేడా లేకుండా ఇంటింటా జ్వరాలతో జనం సతమతం అవుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే చాలు.. అందరినీ చుట్టుముట్టేస్తోంది. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా.. ఇలా అన్నీ ఒక్కేసారి ఎటాక్ షురూ చేశాయి. చికెన్‌గున్యా కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. దీంతో ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. మొన్నటి వరకు 500 ఉన్న ఓపీ ఇప్పుడు 800 వరకు పెరిగిందని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. అలాగే, చిన్నారులపై చలి తీవ్ర ప్రభావం చూపిస్తుందని నీలోఫర్ వైద్యులు తెలిపారు. నిలోఫర్‌కు సోమవారం వచ్చిందంటే 1500 మంది ఔట్‌పేషెంట్లుగా నమోదు అవుతూన్నరు. ఇందులో చలి కారణంగా "న్యూమోనియా' వంటి శ్వాస సంబంధ సమస్యలతో వచ్చిన పిల్లలే ఎక్కువగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇదే పరిస్థితి ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లోనూ నెలకొంది. ప్రతిరోజు వెయ్యి మంది చిన్నారులు ఆస్పత్రికి వస్తున్నారన్నారు. తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు వైద్యులు. వాతావరణ మారడంతో రకరకాల వైరస్‌లు దాడి చేస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చికెన్ గున్యా. డెంగీ వెరల్ ఇన్‌ఫెక్షన్స్ కాబట్టీ అప్రమత్తంగా వుండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వం విష జ్వరాలపై అప్రమత్తమైంది. సీజనల్ ఫీవర్స్, ఫుడ్ పాయిజన్స్‌పై అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను అలర్ట్ జారీ చేసింది. అన్ని పీహెచ్‌సీలకు ఫీవర్ ఎమర్జెన్సీ కిట్స్ తరలించారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైరల్ ఫీవరే కదా అని లైట్ తీస్కోవద్దు. ఎందు కంటే విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటున్నారు. టైమ్‌కి ట్రీట్‌మెంట్ తీసుకోక పోతే మాత్రం ప్రాణాలు పోవడం ఖాయం. మెయిన్‌గా ప్లేట్ లెట్స్ పడిపోతాయ్. ఊపిరి తిత్తులు, కాలేయం, గుండెపై ప్రభావం చూపిస్తుంది. బీపీ డౌన్ అవుతుంది. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారినడకుండా ఉండొచ్చు. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో చలి గాలిలో తిరగవద్దని, బయటికి వెళ్లినప్పుడు మాస్క్‌లు ధరించడం మంచిది. వెచ్చగా ఉండే దుస్తులను ధరించాలి. రోగ నిరోధక శక్తి పెరిగే ఆహారం తీసుకోవాలి. అందుకే బీ కేర్ ఫుల్.





మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, పక్కన సిలిండర్

## సోమాజిగూడలో అగ్నిమాదం

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్తః**

సోమాజీగూడలోని ఎనిమిది అంతస్థుల అల్‌పైన్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. దట్టమైన పొగతో పాటు భారీగా మంటలు ఎగిసిపడుతు న్నాయి. నాలుగు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను నియంత్రిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఎ-బ్లాక్‌లోని ప్లాట్ నంబరు 502లో గ్యాస్ సిలండర్ పేలుడు వల్ల అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా గుర్తిం చారు. తాళం చెవులు లేకపోవడంతో అగ్నిమాపక అధికారులు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవే శించారు. ఇంట్లో దెబ్బతిని కనిపించిన సిలండర్‌ను అధికారులు గుర్తించారు. ముందు జాగ్రత్తగా అపార్ట్‌మెంట్ వాసులను ఖాళీ చేయించారు. సహా యక చర్యలను చేపడుతున్నారు. పోలీసులు సైతం అక్కడికి చేరుకొని స్థానికులను దూరం పంపిం చారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా దాదాపు అయిదు అంబులెన్స్‌లను ఏర్పాటుచేశారు.




## జిహెచ్ఎంసి పునర్విభజన.. పోలీస్ కమిషనరేట్ల రీషఫిలింగ్

**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త**

జిహెచ్ఎంసి పునర్విభజన తర్వాత పోలీస్ శాఖలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. జిహెచ్ఎంసి పరిధిలోని మూడు పోలీస్ కమిషరేట్లను రీషఫలింగ్ చేశారు. మొత్తం మూడు కమిషనరేట్లను 12 జోన్లుగా విభజించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 6 జోన్లు, సైబరాబాద్‌లో 3, రాచకొండ కమిషనరేట్‌ను 3 జోన్లుగా మార్పులు చేశారు. పోలీస్ కమిషనరేట్ల రీషఫలింగ్‌లో భాగంగా శంషాబాద్ జోన్ కొత్తగా హైదరబాద్ కమిషనరేట్ కలిపారు. దీంతో పాటు రాజేంద్రనగర్ జోన్ కూడా ఈ కమిషనరేట్ లో మెర్జ్ చేశారు. దీంతో చార్మినార్ జోన్, గోల్కొండ జూన్, ఖైరతాబాద్ జోన్, రాజేంద్రనగర జోన్, సికింద్రాబాద్ జోన్, శంషాబాద్ జోన్లు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి. మరోవైపు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో కూడా భారీగా మార్పులు జరిగాయి. ఈ కమిషనరేట్ పరిధిలో శేరలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు ఉండగా.. మొయినాబాద్ నుంచి పటాన్ చెరు వరకు శేరిలింగంపల్లి జోన్‌లో కలిపారు. మాదాపూర్‌ను కూకట్‌పల్లిలో జోన్‌లో కలిపారు. కుత్బుల్లాపూర్ యథాతథంగా ఉంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎల్బీనగర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్ జోన్లు ఉన్నాయి. ఇంతకుముందు ఈ కమిషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి జిల్లా ప్రాంతాలను యాదాద్రి జిల్లా ఎస్పీ పరిధిలోకి రానున్నాయి. మరోవైపు మహేశ్వరం జోన్, షాద్‌నగర్, చేవెళ్ల జోన్లను కలుపుతూ ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు పోలీసు శాఖ తెలిపింది.

# మరి కొన్నాళ్లు 'కిరాయి' బడులే!

- తరలింపు అసాధ్యమంటున్న అధికారులు
- పాతబస్తీలోనే అత్యధికం
- విద్యార్థుల హాజరుపై ప్రభావం

**చాంద్రాయణగుట్ట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** పాతబస్తీలో కొన్నేళ్లుగా ప్రైవేటు(అద్దె) భవనాలలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల తరలింపు అంత ఆషామాషీగా కనిపించటం లేదు. వీటి తరలింపు అధికారులకు సవాలుగా మారింది. సమీపంలో అనుకూలంగా ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు లేకపోవటంతో తరలింపు అసాధ్యంగా కనిపిస్తుంది. ఒకవేళ పాఠశాలలను తరలించినా ఇక్కడి విద్యార్థులు అక్కడికి వస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు అద్దె భవనాలలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను డిసెంబర్ 31లోగా ప్రభుత్వ భవనాలలోకి మార్చాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. మిగిలిన మూడురోజుల్లో ఇన్ని పాఠశాలల తరలింపు సాధ్యమయ్యేలాలేదు. ఈ నేపథ్యంలో వచ్చిన వరుస సెలవులతో అధికారులు ఒక స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోతున్నారు. తరలింపుపై మల్లగుల్లాలు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో 155 ప్రభుత్వ పాఠశాలలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీటిలో హైదరాబాద్‌జిల్లాలోనే అత్యధికంగా 105 పాఠశాలలు కిరాయి భవనాలలో నడుస్తున్నాయి. పాతనగరంలోని బండ్లగూడ, బహదూర్‌పురా, చార్మినార్ జోన్ల పరిధిలోనే వీటి సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఎక్కువగా అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. బండ్లగూడ జోన్‌లో 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా అన్ని సొంత భవనాలలో కొనసాగుతున్నాయి. ఇక బండ్లగూడ జోన్-1లో 14 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు అద్దె భవనాలలో కనసాగుతున్నాయి. వీటిలో నాలుగు తెలుగు మాధ్యం కాగా మిగిలినవి ఉర్దూ మాధ్యమంలో నడుస్తున్నాయి. చార్మినార్ జోన్‌లోని చార్మినార్ ఒకటిలో రెండు భవనాలలో ఉదయం, పగలు షిఫ్టులో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నడుస్తుండగా, చార్మినార్ రెండులో నాలుగు భవనాలలో షిఫ్టు విధానంలో ఉదయం ప్రాథమిక, మధ్యాహ్నం ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. చార్మినార్ ఒకటిలో 16, రెండులో ఏడు పాఠశాలలు అద్దె భవనాలలో నడుస్తున్నట్లు సమాచారం. ఇక బహదూర్‌పురా జోన్‌లో నాలుగు ఉన్నతపాఠశాలలు అద్దె భవనంలో, చాలావరకు ప్రాథమిక పాఠశాలలు అద్దె భవనాలలో నడిపిస్తున్నాయి. ఇన్ని పాఠశాలలను ఉన్నఫళంగా సమీపంలోని ప్రభుత్వ భవనాలు, పాఠశాలలకు తరలించలేని పరిస్థితి నెలకొంది. వీటిపై అధికారులు, ప్రధానోపాధ్యాయులు అధ్యయనం చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంకా నాలుగు నెలలు మిగిలున్న సమయంలో పాఠశాలల తరలింపు విద్యార్థుల హాజరుపై ప్రభావం చూపనుంది. ఉపాధ్యాయులకూ ఇబ్బంది కానుంది. తల్లిదండ్రుల నుండి వ్యతిరేకత రానుంది. ఈ విద్యా సంవత్సరం చివరన వేసవి సెలవులలో ఈ కార్యాచరణను అమలు చేస్తే విద్యార్థుల చదువుకు, ఉపాధ్యాయుల బోధనకు అటంకం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



శివాజీనగర్‌లోని లాల్‌దర్వాజా ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాల




సాయిబాబానగర్‌లోని కుమ్మర్‌వాడి ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాల



కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావవేడుకల్లో కేక్‌కట్‌చేస్తున్న లక్‌పతి యాదగిరిగౌడ్, జ్యోతి

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో వేడుకలను ప్రారంభించిన లక్‌పతి యాదగిరిగౌడ్**

**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నల్లకుంట డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎ.జ్యోతి యాదగిరిగౌడ్‌తో కలిసి పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం వారు భారీ కేక్‌కట్ చేసి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ పుట్టిందని పేర్కొన్నారు. నేడు దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ముందుందని తెలిపారు. అలాంటి చరిత్రాక నేపథ్యం ఉన్న పరిస్థితుల్లో నేడు మహాత్మా గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల పేర్లు చరిత్రలో లేకుండా చేయాలని మోదీ ప్రభుత్వం కుట్రచేస్తోందని నిప్పులు చెరిగారు. పేదలకు ఉపయోగపడే అనేక పథకాలను కాంగ్రెస్ తీసుకువచ్చిందని అన్నారు. గరీబీ హటావో నినాదం, బ్యాంకుల జాతీయికరణ, ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం వంటి అనేక పథకాలను తీసుకువచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ అధ్యక్షుడిగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్ బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ , పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌గౌడ్, రామ్మోహన్‌రావు, సాయికిరణ్, మల్లేష్, సన్నీ, సోనీ, రోహిత్, వినయ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

**అత్తాపూర్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం టాటానగర్‌లోని శివానంద్ బ్రదర్స్ ప్లాస్టిక్ గ్రాయిన్ వర్క్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అదేవిధంగా దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి అదుపులోకి తీసుకువచ్చారు. దింతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే కంపెనీ లో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది.

## పరామర్శకు వచ్చారు.. ఆభరణాలను కాజేశారు

**- బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** తండ్రి చనిపోయాడన్న బాధలో కుటుంబ సభ్యులు ఉండగా పరామర్శకు వచ్చిన బంధువుల్లో ఒకరు ఇంట్లోని బంగారు ఆభరణాలను కాజేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం..బంజారాహిల్స్‌లోని ఫస్ట్‌ల్యాన్సర్‌లో నివసించే షేక్ ముజఫర్ తండ్రి ఈ నెల 25న మృతిచెందాడు. దీంతో అతని తరుపు కుటుంబ సభ్యులతోపాటు భార్య తరుపు కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చారు. తండ్రి అంత్యక్రియలను రాత్రి 8 గంటలకు పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వచ్చారు. మరునాడు ఉదయం అతని భార్య బట్టలు మార్చుకోవడానికి గదిలోకి వెళ్లగా అల్మారా తాళాలు వారు పెట్టిన చోట కాకుండా మరో చోట కనిపించాయి. దీంతో అనుమానం వచ్చిన ఆమె అల్మారాలో పెట్టిన ఆభరణాలను చూడగా అవి కనిపించలేదు. దాదాపు 5 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో వచ్చిన తమ బంధువుల్లోనే ఎవరో ఆభరణాలు చోరిచేసి ఉంటారని అనుమానిస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నమ్మించి ఆభరణాలతో ఉడాయించిన సాఫ్ట్‌వేర్ జంట

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** బంగారు ఆభరణాల దుకాణదారును నమ్మించిన ఒక జంట ఆభరణాలతో విదేవాలకు ఉడాయించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 8లో రోహిత్ డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టోర్ ఉంది. కాగా చాలా సంవత్సరాలుగా కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ స్వర్ణలత కేశనపల్లి అలియాస్ భీమినేని స్వర్ణలత ఆమె భర్త కేశవ నాయుడు కేశనపల్లిలు రోహిత్ డైమండ్ జువెలరీలో పలుమార్లు వ్యాపార లావాదేవీలు నిర్వహించి నమ్మించారు. 2023లో వీరిద్దరు కలిసి సుమారు 61 తులాల బంగారు వజ్రాభరణాలను ఎంపిక చేసుకున్నారు. తమకు నచ్చిన వాటికి డబ్బులు చెల్లించి ఉంచుకొని మిగిలిన వాటిని తిరిగిస్తామని నమ్మించి ఆయా ఆభరణాలను తమతోపాటు తీసుకెళ్లారు. అయితే రోజులు గడుస్తున్నా ఆభరణాలు తిరిగి ఇవ్వలేదు, ఎలాంటి చెల్లింపులు చేయలేదు. రోజురోజుకు మాటలు చెబుతూ నమ్మించి అమెరికాకు పారిపోయారు. నిందితులు ఆయా ఆభరణాలను విక్రయించి తద్వారా ఆయా డబ్బులను తప్పుడు మార్గాల్లో విదేశాలకు తరలించారు. దీంతో అనుమానించిన స్టోర్ నిర్వాహకులు వారి గురించి ఆరా తీయగా ఇదే తరహా మోసాలలో ఉన్నారని గుర్తించారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భవనంపై నుంచి పడి లిఫ్ట్ టెక్నీషియన్ మృతి

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** ప్రమాదావశాత్తు నాలుగో అంతస్థు నుంచి జారిపడి చికిత్స పొందుతున్న ఒక లిఫ్ట్ టెక్నీషియన్ మృతి చెందిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడులోని తిరునేల్‌వేలి జిల్లా వగైకుల్లం గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్(23) లిఫ్ట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం నగరానికి వచ్చిన అతను అమీర్‌పేటలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 14న జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని ఒక నిర్మాణంలో ఉన్న భవనంలో పనులు చేస్తున్న అతను నాలుగో అంతస్థు నుంచి ప్రమాదావశాత్తు జారి పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని అపోలో ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతున్న అతన్ని ఈ నెల 26న కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి సోదరుడు మనోజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధురాలికి బెదిరింపులు.. బిల్డర్‌పై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** బంజారాహిల్స్‌లో ఓ వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి బెదిరింపులకు పాల్పడ్డ బిల్డర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్‌నెంబర్3లో నివసించే 70ఏళ్ల వృద్ధురాలు ఫాతిమా నివసిస్తుంది. ఈ నెల 24న బిల్డర్ సయ్యద్ అబ్దుల్ బారి నియమించిన పెయింటర్లు అనుమతి లేకుండా వృద్ధురాలిఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి పెయింటింగ్ పనులు చేపట్టారు. ఇంటి గేట్ తాళం వేసి ఉన్నప్పటికీ పక్క భవనం కిటికీ ద్వారా లోపలికి రావడమే కాకుండా ఇదేమని ప్రశ్నించగా బిల్డర్ వృద్ధురాలిను దూషిస్తూ బెదిరించాడు. ఇంట్లోకి వచ్చాక మీకు మా సత్తా చూపిస్తాం అంటూ పలుమార్లు బెదిరించాడు. దీంతో బిల్డర్‌తో ప్రాణహాని ఉందంటూ ఆమె ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు బిల్డర్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు

## ప్రజా వాగ్గేయకారుడు పాలడుగు నాగయ్య

### మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు

**చిక్కడపల్లి, డిసెంబర్ 28 (ప్రభాతవార్త):** ప్రజా వాగ్గేయకారుడు పాలడుగు నాగయ్య అని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. పదునైన పాటలతో, బుర్ర కథలతో, గేయ రూపకాలతో సమాజాన్ని చైతన్యపరచిన కవి పాలడుగు నాగయ్య అని అన్నారు. ఆయన రచించిన సమగ్ర సాహిత్య పుస్తకాల ఆవిష్కరణను ఆదివారం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో జరిగింది. బుక్ పెయిర్‌లో పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుస్తకాలతో పాటు సరోజిని దేవి పుస్తకాలు (కవిత్వం), దామోదరం సంజీవయ్య బుర్ర కథ తదితర పుస్తకాలు బుక్ ఫెయిర్‌లోని స్టాల్ నంబర్ 279లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు స్టాల్‌ను సంప్రదించాలని పాలడుగు నాగయ్య కుమార్తె, సరోజినిదేవి తెలిపారు.

## విద్యార్థులు కళలు, క్రీడల్లోనూ రాణించాలి

### ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వర్‌రావు

**చిక్కడపల్లి, డిసెంబరు 28(ప్రభాతవార్త) :** కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, విద్యార్థులు కళలు క్రీడల్లోనూ రాణించాలని ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో గీతాంజలి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఎన్.శాంత అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన పరుచూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఎప్పుడూ తెలుగు భాషా గొప్పదనాన్ని, విద్యార్థులు తమ మాతృభాషను గౌరవించాల్సి న అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యార్థి జీవితంలో గురువుల ప్రాముఖ్యతను వారి మార్గదర్శకత్వాన్ని కొనియాడ దగినదని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులలో క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం ఉండాలని. సూచించారు. చిక్కడపల్లి వంటి సాంస్కృతిక కేంద్రంలో ఇంతటి క్రమశిక్షణ గల విద్యార్థులను చూడటం సంతోషంగా ఉందన్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, సెంట్రల్ కాలేజీ ప్రొఫెసర్ డి.ఎస్.ఎన్.మూర్తి, సినీ నటి ప్రీతి నిగమ్, కర్ర నగేష్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

### నూతన సంవత్సర తొలి రోజు

## వంశీ ప్రచురణల పంచ గ్రంథాలు ఆవిష్కరణ

**చిక్కడపల్లి, డిసెంబరు 28 (ప్రభాతవార్త):** వంశీ ఆర్ట్ థియేటర్స్, వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మికి సాహితీ సామ్రాజ్ఞి బిరుదు ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి వివరించారు. 2026 జనవరి 1 న చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో డాక్టర్ తెన్నేటి సుధ రచించిన సుధ కథలు 2 వ భాగం,వంశీ కథల సంకలనం 3 వ భాగం జయ శ్యామల రచన పూర్ణిమ నవల శామీర్ జానకి రచన మనసు పలికే గీతం, డాక్టర్ తెన్నేటి శ్యామ కృష్ణ రచన కృష్ణునితో నా సంభాషణ అయిదు గ్రంథాల విష్కరణ ఉంటుందని, ముఖ్యఅతిధిగా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి హాజరై అత్తలూరి విజయలక్ష్మి ్కి బిరుదును ప్రదానం చేస్తారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సినీ దర్శకులు రేలంగి నరసింహ రావు, సింగపూర్ తెలుగు సమాజం పూర్వ అధ్యక్షుడు వామరాజు సత్యమూర్తి, తెలుగుతల్లి పత్రిక డైరెక్టర్ అప్పుల వాణి, జెవి పబ్లికేషన్స్ ప్రచురణకర్త జ్యోతి వలబోజు తదితరులు పాల్గొన్నారు. వంశీ ప్రచురించిన అయిదు గ్రంథాల ఆవిష్కరణ ఉంటుందని, ఉగాండా దేశానికి చెందిన డాక్టర్ బూరుగుపల్లి వ్యాసకృష్ణకు గ్రంథాలను స్వీకరిస్తారు. ఇదేసభలో వంశీసాహితి కిరణం కథల పోటీలలో నెగ్గిన వారికీ బహుమతులు అందిస్తామన్నారు. ఈ సందర్భం గా వాణి రమణ శిష్యులు సంస్కృతి , అంజనాదేవి, తన్మయి, శ్రీవర్షలచే కూచిపూడి నృత్యం,, ప్రముఖ గాయకుడు వై.ఎస్.రామకృష్ణ స్వరసారధ్యంలో బహుగళ గాత్ర విన్యాసం సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.

## నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు ఒకే సర్కిల్‌లో ఉండాలి

### గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ



సమావేశంలో పాల్గొన్న మారిశెట్టి నరసింగరావు, శీలం సత్యనారాయణ

**చిక్కడపల్లి, డిసెంబర్ 28 (ప్రభాతవార్త):** గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ సమావేశం సీనియర్ కాంగ్రెస్ నేత, లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ మారిశెట్టి నరసింగ రావు అధ్యక్షతన ఆదివారం స్థానిక జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం డివిజన్‌ల పునర్విభజనలో భాగంగా ముషీరాబాద్ సర్కిల్ లో నుండి గాంధీనగర్ డివిజన్ ను తీసివేసి నూతనంగా ఏర్పాటుచేసిన కవాడిగూడ సర్కిల్‌లో కలపడం వంటి అంశాలపై కూలంకషంగా చర్చించారు. నియోజకవర్గానికి సంబందించినంతవరకు అన్ని డివిజన్ లు ఒకే సర్కిల్ లో ఉండాలని, కానీ కొన్ని ఒక సర్కిల్ లో మరి కొన్ని మరో సర్కిల్ లో ఉండడం భావ్యం కాదని, ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల వద్ద ప్రస్తావించి నియోగజకవర్గంలోని అన్ని డివిజన్ లు ఒకే సర్కిల్ లో ఉండేలా ఒత్తిడి తీసుకురావాలని సమావేశం అభిప్రాయపడింది. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, జయేందర్ బాబు, గుండు జగదీష్ బాబు, సురేష్ యాదవ్, బాబు రావు, భాస్కర్ రెడ్డి, శ్రీను, రాజు, విజయేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

**చార్మినార్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆదివారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్‌కు మందిరం కమిటి ప్రతినిధులు స్వాగతం పలికారు.అనంతరం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి చారిత్రక చార్మినార్‌ను తిలకించారు.చార్మినార్ సమీపంలో ఉన్న లాడ్‌బజార్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



పూజలు నిర్వహిస్తున్న కుమార్ సింగ్

# ప్రపంచ ఉన్మాదానికి సాయితత్వమే పరిష్కారం

### ఆదాయపు పన్నుల శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ నరసింహప్ప



సాయితత్వం లీలా రహస్యం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహప్ప, రాజగోపాల్, తదితరులు

**చిక్కడపల్లి, డిసెంబరు 28 (ప్రభాతవార్త) :** ప్రపంచ ఉన్మాదానికి షిరిడిసాయి తత్వమే సరైన పరిష్కారమని ఆదాయపు పన్నుల శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప పేర్కొన్నారు.ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీ భం సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా. వి.డి.రాజగోపాల్ అధ్యక్షతన కళారత్న డా. బిక్కి కృష్ణ రాసిన సాయితత్వంలీలా రహస్యం గ్రంథాన్ని నరసింహప్ప ఆవిష్కరించారు. భారతదేశంలో ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను పరిశోధించి బిక్కి కృష్ణ సాధికారికంగా సాయితత్వం గ్రంథాన్ని రచించారన్నారు.అభ్యుదయ కవిగా, విమర్శకునిగా పేరు పొందిన బిక్కి కృష్ణ కులమతాలకతీతమైన సమానత్వాన్ని, మానవత్వాన్ని ప్రభోదించిన జగద్గురువు శిర్డిసాయి తత్వంపై సాధికారికమైన పరిశోధనా గ్రంథం రాయడం అభినందనీయమన్నారు. బిక్కి కృష్ణ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు అనితర సాధ్యమని, వేలాదిమంది కవులు కళాకారులను వెలుగులోకి తేవడానికి గత నాలుగు దశాబ్దాలుగా కృషిచేస్తున్నారని డా.రాధాకుసుమ అన్నారు. గ్రంథ సమీక్షకురాలు పద్మశ్రీలత, ప్రముఖ సాహితీవేత్త, రంగస్థల నటుడు అక్కిరాజు సుందరామకృష్ణ, సంఘ సేవకులు మారెళ్ళ రాజరాజేశ్వరి, కోగంటి శాంతిశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు డా. శాంతిశ్రీ, మానస రఘు, డా. కోగంటి ఉషారాణి, అబ్దుల్ రషీద్ తదితరులను, శ్రీ భం సాయి ట్రస్టు అధ్యక్షులు యం. నరసింహప్ప, విశ్రాంత మైన్స్ డైరెక్టర్ వి.డి. రాజగోపాల్ మెమొంటో శాలువాలతో ఘనంగా సన్మానించారు.గత పదేళ్లుగా తాను సాయితత్వంపై పరిశోధన చేసి రాసిన గ్రంథాన్ని తన గురువుయం. నరసింహప్ప వెలువరించడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని పుస్తక రచయిత బిక్కి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



మణికొండను సర్కిల్‌కు పెట్టాలని డిమాండ్ చేస్తున్న బిఆర్ఎస్ నేతలు

## అధికార కాంగ్రెస్‌ను మున్సిపల్ ఎన్నికల్లో బొందపెట్టాలి

### బిఆర్ఎస్ నాయకులు

**నార్సింగి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా, నియంతృత్వపు ధోరణితో పాలన చేస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీని వచ్చే కార్పోరేషన్ ఎన్నికల్లో బొందపెట్టాలని మణికొండ బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, నరేందర్, ఏర్పుల శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం అంతర్జాతీయంగా పేరున్న మణికొండ పేరును సర్కిల్‌కు పెట్టాలని, మణికొండ మున్సిపల్ కార్యాలయంలో సర్కిల్ కార్యాలయంను నిర్వహిస్తూ నార్సింగి పేరు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల అసమర్థత కారణంగానే నార్సింగి కన్నా అధిక జనాభా ఉన్నా మణికొండకు కేవలం రెండు డివిజన్లు వచ్చాయని తెలిపారు. రెండు జాతీయ పార్టీలు గత ఐదేళ్ల పాటు మణికొండను ఏలినా ఎక్కడున్న గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఎద్దేవ చేశారు. ఆఖరుకు మణికొండ పేరు కనుమరుగవుతున్నా మాజీ ప్రజా ప్రతినిధులు నోళ్లు మెదకపోవడం సిగ్గుచేటన్నారు. అధికార కాంగ్రెస్‌ను బొంద పెడితేనే నియంతృత్వ పాలనకు తెరపడుతుందన్నారు. ప్రజలంతా ఏకమవ్వాలని, మణికొండకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే కార్పోరేషన్ ఎన్నికల్లో కర్రుకాచి వాత పెట్టాలని బిఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంగం శ్రీకాంత్, విఠల్, కిరణ్, ఆరిఫ్, సుమనళిని, మల్లేష్, శ్రీధర్, బాలాజీ, సంపత్, సుమన్, నరేష్, మహేందర్ పాల్గొన్నారు.

## రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసుల వినతి



రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

**నార్సింగి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని సాయిహర్షా కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నేత పూలపల్లి కృష్ణారెడ్డికి వినతిపత్రంను అందజేశారు. కాలనీ వాసుల వినతిపత్రం అందుకున్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే గత రెండున్నర దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్నానని తెలిపారు. ఐదేళ్లపాటు సర్పంచ్‌గా బాధ్యలు నిర్వహించి ప్రజలకు సేవ చేసుకున్నానని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహకారంతో పరిష్కరించుకోవడం జరుగుతుందన్నారు. వచ్చే కార్పోరేషన్ ఎన్నికల్లో తిరిగి ప్రజల ముందుకు వెళ్తానని, కార్పోరేటర్‌గా అవకాశం ఇవ్వాలని కోరుతానని కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. హైదర్షాకోట్ డివిజన్ తొలి కార్పోరేటర్‌గా ప్రజలు నన్ను ఆశీర్వదించాలని, నిత్యం వారి మధ్యలోనే ఉంటున్నానని, మౌళిక వసతులైన తాగు నీరు, వీధి దీపాలు, డ్రైనేజి, రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు వంటి సమస్య లను పరిష్కరింపచేస్తున్నానని తెలిపారు. సాయిహర్ష కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను వేగంగా పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీనిచ్చారు. కాలనీ వాసులు కృష్ణారెడ్డి స్పందన పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## రాజారామిరెడ్డి మృతికి పలువురు సంతాపం

**చిక్కడపల్లి, డిసెంబరు 28 (ప్రభాతవార్త) :** ఆర్‌సీరెడ్డి సోదరుడు భూమన రాజారామిరెడ్డి(63) గత హఠాన్మరణం చెందారు. మృదుస్వభావం, సాదాసీదా జీవితం, ఆప్యాయతతో కూడిన హృదయంతో ఆయన అందరి అభిమానాన్ని సంపాదించారు. ఆర్ బి శాఖలో ఇంజినీర్‌గా సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణ అనంతరం, అశోక్‌నగర్ ఆర్‌సి రెడ్డి ఐఎఎస్ స్టడీ సర్కిల్ పరిపాలన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించారు. ఆకస్మికంగా రాజారామిరెడ్డి మరణించిన వార్తను తెలుసుకున్న పలువురు విద్యార్థిని విద్యార్థులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాగా అంత్యక్రియలు ఆదివారం ఫిల్మ్‌నగర్‌లోని మహా ప్రస్థానంలో నిర్వహించారు. రాజారామిరెడ్డి మృతి పట్ల అశోక్‌నగర్‌లోని పలు కోచింగ్ సెంటర్ల చైర్మన్లు, ఫాకల్టీలు సంతాపం తెలిపారు.



మాట్లాడుతున్న శంకర్‌గౌడ్. చిత్రంలో రమేష్, మణికంఠ, ప్రహ్లాదాచారి

## టిటిడిలో వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాటు పూర్తి

### లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ శంకర్‌గౌడ్

**సైఫాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు శ్రీవారి వైకుంఠ దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని టిటిడి(హిమాయత్‌నగర్) లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ నేమూరి శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం హిమాయత్‌నగర్‌లోని తిరు నిలయంలో టిటిడి డిప్యూటి ఏఈవో రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ తెల్లవారుఝూమున 1.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులకు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారి సర్వదర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ముఖ్యంగా క్యూలైన్‌లు, మంచినీరు, విద్యుత్, ట్రాఫిక్ సమస్య లేకుండా శ్రీవారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదలతోపాటు అన్న దాన ప్రసాద వితరణ చేస్తున్నామని ఆయన చెప్పారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి జరిగే పూజా కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతాయని 30వ తేదీ తెల్లవారు ఝూమున 12.01 గంటల నుంచి శ్రీవారికి ఏకాంత సేవ, 12.20 నుంచి 12.40 తిరుప్పవై సేవతోపాటు తోమాల సేవ, సహస్ర అర్చన, ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 1.30 నుంచి అర్ధరాత్రి వరకు భక్తులకు సర్వ దర్శనం కొనసాగు తుందన్నారు. మధ్య, మధ్యలో శ్రీవారికి ఏకాంత సేవలు, నైవేద్యం కొనసాగుతాయని, ప్రత్యేకంగా వృద్ధులు, వివిపిలకు స్వామివారి దర్శనం కల్పిస్తు న్నామన్నారు. దేవాలయం సిబ్బంది, పోలీసులు సూచించిన ప్రదేశాలలో వాహనాలను పార్కింగ్ చేసు కోవాలని ఆయన భక్తులకు సూచించారు. సమావేశంలో టిటిడి అధికారులు మణికంఠ శ్రీనివాస్, లక్ష్మీపతి, అర్చక వేద పండితులు ప్రహ్లాదాచారి పాల్గొన్నారు.

**జూబ్లీహిల్స్ టిటిడి ఆలయంలో...**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లోని టిటిడి దేవా లయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి జూబ్లీహిల్స్ లోకల్ అడ్వైజీ కమిటీ ఛైర్మన్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. టిటిడి దేవాల యంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కలిపనంచేదుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తెల్లవారు జామున 1.30 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు భక్తులకు ఉత్తరద్వార దర్శనం ద్వారా దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటుచేశామన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు పండ్లరసాలు, మజ్జిగ, బాదంపాలు ఉచితంగా అందిస్తా మన్నారు. గతేడాది దాదాపు 40వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, ఇందుకు సంబం ధించి ఇప్పటికే ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, శాంతిభద్రతల విభాగ పోలీసులతో సమన్వయం చేసుకొని సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. భక్తుల కోసం టిటిడి ప్రసాద కౌంటర్లతోపాటు టిటిడి ఉత్పత్తులతో కూడిన కౌంటర్లను భక్తులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లాలో రూ. 20కోట్లతో పది ఎకరాల్లో టిటిడి ఆలయ నిర్మాణం, కొండగట్టులో రూ. 35 కోట్లతో అభివృద్ధి పనులు జనవరి మొదటి వారంలో ప్రారంభమవుతాయని వివరించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ చాటిన శివాని

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** జాతీయ స్థాయి ఈత పోటీల్లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జెహెచ్‌పీఎస్)కు చెందిన విద్యార్థిని శివాని కర్ర ప్రతిభను చాటారు. బంగారు పతకంతోపాటు రెండు రజిత పతకాలను సాధించి తన సత్తాను చాటారు. ఢిల్లీలో తాజాగా జరిగిన 69వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ)లో తొమ్మిదో తరగతి చదవుతున్న శివాని కర్ర పాల్గొన్నారు. తన అసాధారణ ప్రతిభతో 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీల్లో జాతీయ రికార్డును సొంతం చేసుకొని ఒక బంగారు, రెండు రజిత పతకాలను దక్కించుకున్నారు. శివాని సాధించిన విజయంతో పాఠశాల అధ్యక్షుడు మురళీముకుంద్‌తోపాటు డైరెక్టర్, ప్రిన్సిపల్ విద్యార్థిని అభినందించారు. మరిన్ని పతకాలను సాధించాలని సూచించారు.

# సాయిబాబా ఆకస్మిక మృతి..పలువురి నివాళి



సాయిబాబా పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని, తదితరులు

**బేగంపేట, డిసెంబరు 28, ప్రభాతవార్త :** సాయిబాబా మృతితో మంచి మనిషిని కోల్పోయామని పలువురు నాయకులు,అభిమానులు విచారం వ్యక్తం చేసారు. సాయిబాబా మృతితో మంచి మిత్రుడిని కోల్పోయానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తంచేసారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సాయిబాబా శనివారం రాత్రి ఆకస్మిక మృతి చెందారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతోపాటు పలువురు అభిమానులు ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. విషయం తెల్సుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం బేగంపేట భగవంతాపూర్ లోని ఆయన నివాసానికి వెళ్లి సాయిబాబా పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని,సంతాపాన్ని తెలియజేసారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, తీగల కృష్ణారెడ్డి, నందమూరి రామకృష్ణ దంపతులు, రావుల చంద్రశేఖరరెడ్డి, టీడీ జనార్థన్, టీడీపీ మాజీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండూరి సాంబశివరావు, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, శేఖర్, నాగరాజు, ఆరీఫ్, టీడీపీ, బీఆర్ఎస్, ఎంఐఎం వివిధ పార్టీల నాయకులు ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. సాయిబాబా పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు బేగంపేట భగవంతాపూర్‌లోని నివాసం నుంచి తెలుగుదేశం పార్టీ నగర పార్టీ కార్యాలయానికి తరలిస్తారు. అక్కడ అభిమానులు, నేతల సందర్శనానంతరం గోల్నాకలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేసారు.



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బండిరమేష్. డివిజన్ అధ్యక్షుడు రమేష్

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**బేగంపేట, డిసెంబరు, 28,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ 141ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ లో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ శ్యాంలాల్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద,బడుగు,బలహీన వర్గాల పార్టీ అని అన్నారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరపల్లి రమేష్ తో పాటు హాజీటోచర్, రామగళ్ల రమాదేవి, దర్గ కరుణాకర్, దయానంద్, పద్మారెడ్డి, చినబాబు, రాధ, యువజన కాంగ్రెస్ నాయకులు భరత్, సురేష్, ఆలీ, పర్వేజ్, అఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

**పాటిగడ్డ చౌరస్తాలో...**



జెండాఆవిష్కరణలో బెలూన్లువదులుతున్న కోట నీలిమ, విశాల్ సుధావ్

**బేగంపేట, డిసెంబరు 28,ప్రభాతవార్త :** ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కాంగ్రెస్ జెండాను గర్వంగా నిలపాలని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ, సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ సీనియర్ నాయకులు విశాలు సుధాంలు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాటిగడ్డ చౌరస్తాలో వారు జెండాను ఆవిష్కరించారు. బెలూన్లను గాలిలోకి వదిలారు. కార్యక్రమం విశాల్‌సుధాం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పి.ఎల్.కృష్ణ, వి.చిరంజీవి, నసీరుద్దీన్(అడ్డు), తస్లీం,సిద్దిఖీ, ఎం.కృష్ణారావు, బాల, మోహిత్, బుస్రా, సబా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ

**బేగంపేట, డిసెంబరు 28,ప్రభాతవార్త :** 60ఏళ్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ అని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ అన్నారు.141కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా రాంగోపాల్‌పేట డివిజన్ కస్తూర్బానగర్ టి.19టవర్స్ వద్ద త్రికాల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోట నీలిమ మాట్లాడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగానే అధికారంలోకి వచ్చామన్నారు.ఈ కార్యక్రమంలో మూల వెంకటేష్,దాసరి మల్లేష్,మాకు దుర్గయ్య,ఫర్హానా బేగం, నిరోషా, చాంద్‌పాషా, యాదగిరి, శ్రీనివాస్, నారాయణ, ఖాతాలక్ష్మి, మాణిక్యం, సాదిక్, సంజూ, శివకుమార్, రాకేష్, కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు సంబంధించిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కోట నీలిమ కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## పేదలకు అన్నదానం

**చిక్కడపల్లి, డిసెంబర్ 28 (ప్రభాతవార్త) :** ప్రసిద్ధ భారతీయ ముఖ్య జీవిత బీమా సలహాదారు కౌటికే విఠల్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఎర్రం విజయకుమార్ అభినందన సత్కార కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిధిగా తెలంగాణ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కలువ సుజాత హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. తన పాలసీదారులపట్ల కౌటికె విఠల్ గారు చూపించే నిబద్ధత, సేవా తత్పరత ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ప్రతి విలువైన పాలసీదారుడి జన్మదినానికి 1000 మందికి భోజనం అందించడం ఆయన దానగుణానికి నిదర్శనం" అని కొనియాడారు. కౌటికే విఠల్ మాట్లాడుతూ నా విలువైన పాలసీదారులు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో 100 సంవత్సరాలు జీవించాలని మనస్ఫూర్తిగాఆకాంక్షిస్తున్నాను.అని తెలిపారు. కార్యక్రమంలో కౌటికె విఠల్ కుటుంబ సభ్యులందరుతోపాటు ఎర్రం కిషోర్ గుప్తా, అడ్వకేట్ మడుపల్లి రవిగుప్త, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ నాయకులు కర్నాటి వెంకటేశ్వర్లు జీవిత బీమా ఏజెంట్ ఆనంద్ ఎర్రం విజయకుమార్ వియ్యంకుడు పూర్ణచంద్రరావు, కల్వ సుజాత కుమారులు పాల్గొన్నారు.

## రోగి సహాయకులకు అన్నదానం

**సికింద్రాబాద్, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రుల వద్ద ఆదివారం పేద రోగి సహాయకులు, అభాగ్యులు, అన్నార్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల్‌కు చెందిన ధర్మశాస్త్ర సేవ సమితి అధ్యక్షులు వెంకటేష్ (బొంబాయి గురుస్వామి) మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రతినెల సుమారు 500 మందికి అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తత్వమసి సేవసమాజం వ్యవస్థాపక అధ్యక్షులు బజారు మురళీకృష్ణ గురుస్వామి, ధర్మశాస్త్ర సేవ సమితి కోశాధికారి కేవీ రాజేంద్రప్రసాదరావు, ప్రధానకార్యదర్శి పుల్లారావు, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్, సభ్యులు కృష్ణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, సీహెచ్ కిషోర్, తిరుపతిరావు, సాయికుమార్, కేవీ నాయుడు, బిందుమాధవి, నాగయశస్వీ, కేసన పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల నిరసన

**చార్మినార్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్నదని ఆ పార్టీ బహదూర్‌పుర నియోజకవర్గం ఇంఛార్జి పులిపాటి రాజేష్‌కుమార్ అన్నారు దూద్‌బౌలి చౌరస్తాలో ఆదివారం ఉదయం కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఫత్తేదర్వాజ చౌరస్తాలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి పథకం పేరును తొలగించినందుకు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి పథకం పేదల హక్కు అని,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు.కార్యక్రమంలో నాయకులు జి.కన్నయ్యలాల్,సయ్యద్ షా ముజాహిద్ హుస్సేనీ,సయ్యద్ ఇక్బాల్,భాను చందర్ యాదవ్,మేరాజ్ బేగం,జ్యోతి శెట్టి,ఫయాజ్,ఇబ్రహీం,మీర్ మహ్మద్, జబ్బార్, చంద్రశేఖర్, శ్రీకాంత్, రామకృష్ణ, శారదాశెట్టి, అహ్మద్, ప్రవీణ్, ఖాలేద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తొలగించినందుకు చార్మినార్ వద్ద పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు నిరసన తెలియజేశారు.



నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు




ఛత్రినాక కూడలిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న నగేష్

## ఛత్రినాకలో ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**చాంద్రాయణగుట్ట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ 140వ అవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుకున్నాయి. ఛత్రినాక కూడలిలో జరిగిన కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జ్ బోయ నగేష్ నాయకులతో కలిసి కాంగ్రెస్ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరాటేలో సత్తాచాటిన నాయక్ బూడోకాన్ కరాటే అకాడమి

### ఖాతాలో 24 పతకాలు



గెలుపొందిన కప్పుతో ఎన్‌బికెఎ కరాటే క్రీడాకారులు

**చాంద్రాయణగుట్ట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్ వారనాసిలో జరిగిన 10వ ఎంఎంఎం ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్–2025లో పాతబస్తీ ఛత్రినాక శివగంగానగర్ శ్రీలక్ష్మణేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మండపంలోని నాయక్ బూడోకాన్ కరాటే అకాడమి విద్యార్థులు తమ సత్తాచాటారు. వివిధ విభాగాలలో జరిగిన పోటీలలో 24 పథాకాలు సాధించారు. వీటిలో 10 బంగారు, 8 వెండి, 6 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ముఖ్యఅతిథి శివకుమార్ కేడియా క్రీడాకారులను అభినందించారు. ఇదే క్రీడా స్పూర్తిని కొనసాగించి భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ పి.గణేష్ నాయక్, కరాటే మాస్టర్లు కె.రవిందర్, ఎం.వాసుదేవ్, పి.రాహుల్, రాజు, అజయ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసును తరలించొద్దు'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న డాక్యుమెంట్ రైటర్స్

**అత్తాపూర్ డిసెంబరు 28, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసును తరలించవద్దని కొనసాగించాలని పలువురు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను డాక్యుమెంట్ రైటర్స్‌తో పాటు స్థానిక నాయకులు సామా ఇంద్రపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి ధనుంజయ్‌లు మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రిజిస్ట్రేషన్ ఆఫీసును వేరే చోటుకు తరలించకుండా రాజేంద్రనగర్‌లోని వార్డు ఆఫీస్‌లో కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ను కోరినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీస్ ను వేరే చోటుకు తరలిస్తే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని కావున తరలించవద్దని వినతి పత్రం వివరించినట్లు పేర్కొన్నారు

## మన్ కీ బాత్‌ను వీక్షించిన బిజెపి నేతలు



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షి స్తున్న బిజెపి నేతలు

**అత్తాపూర్ డిసెంబరు 28, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ స్వగృహంలో వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొమురయ్య మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన మనసులో మాట తెలియజెస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని అందరూ అన్ని బూతులలో వీక్షి ంచి సోషల్ మీడియాలలో అప్లోడ్ చేయాల్సిందిగా మనవి చేశారు ఈ కార్యక్రమంలో జయానంద రెడ్డి పెంటల శ్రీధర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి బి భరత్ ఘట్టగోని వేణు రాకేష్ నిఖిల్ సుల్గే అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విజ్ఞప్తి

**సైఫాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులకు సిఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీలపై సోమవారంనుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేసి, అమలును ప్రారంభించాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సందర్ బంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యాన్ని అమలు చేయాలని ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమా శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని బిజెపి, ఎంఐఎం, సిపిఐ పార్టీలు నిలదీయాలని కోరారు. ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ జనవరి 4వ తేదీ నుంచి అల్వాల్‌లో రిలే నిరాహారదీక్షలు ప్రారంభిస్తున్నామని, ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు పంపిణి చేయాలని, అలాగే ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పది వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోరం ప్రతినిధులు పట్లోల సురేందర్, కొండా స్వామి, జి.దయానంద్, బి.జగన్‌యాదవ్, కె.రాంబాబు, నస్రీన్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డాక్టర్ చీమా శ్రీనివాస్

# మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

### శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



విగ్రహావిష్కరణ చేస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్

**సైదాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో లింగోజిగూడ డివిజన్ పరిధిలోని సరూర్‌నగర్ తపాల కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను శాసనసభ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కేవలం ఒక్క వర్గానికి చెందిన వారు కాదని, విశ్వమానవుడని అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అన్నారు. బాబు జగ్జీవన్‌రాం జీవితం మనందరికి స్పూర్తి దాయకమని అన్నారు. స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని అన్నారు. చదువుతోనే ప్రగతి సాధ్యమన్న విషయాన్ని అందరు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి,న ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, బిజెపి ఎల్‌బినగర్ ఇంఛార్జి సామ రంగారెడ్డి, కమిటి ప్రతినిధులు రాంబాబు, రమణ, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానిని కలిసిన జైన్ సేవా సంఘం నూతన కమిటీ

## సేవా కార్యక్రమాల్లో జైన్ సేవా సంఘం ముందంజ

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**అడ్డగుట్ట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** జైన్ సేవా సంఘం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికి అదర్శంగా నిలుస్తుందని, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. జైన్ సేవా సంఘం నూతన కార్యవర్గం కమిటీ సభ్యులు ఆదివారం మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జైన్ సేవా సంఘం ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఉమేశ్, కార్యదర్శి విమల్, ఉపాధ్యక్షులు కైలాస్, వినోద్,కోశాధికారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్మ్‌నగర్ బస్తీలో మన్ కీ బాత్



మన్ కీ బాత్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** ఫిల్మ్‌నగర్‌లోని వినాయక్ నగర్‌లో దేశ ప్రధాని నరేంద్ర మోడి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నేతలు స్థానికులతో కలిసి వీక్షించారు. బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్,నాయకులు బోయ రామాంజనేయులు, అజయ్‌కుమార్, గోపి, రాహుల్, సోమేష్, బిట్టు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని మోడి సందేశాన్ని వీరంతా ఆసక్తితో విన్నారు.

## ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

### మెరుగుపర్చాలి : సిఆర్‌పిఎఫ్

**కంటోన్మెంట్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని బాలలహక్కుల పరిరక్షణ వేధిక జిల్లా కార్యదర్శి సి.హెచ్.లక్ష్మి నారాయణ, తల్లుల సంఘం కన్వీనర్ ఎన్.శోభలు పిలుపునిచ్చారు. ఆదివారం అడ్డగుట్ట ప్రభుత్వ హై స్కూల్‌లో బాలల సంఘాల సమ్మేళనకు వారు ముఖ్య అతిథులుగా హాజరై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సువర్ణ,లావణ్య, లత, సుమలత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## జెకె నగర్‌లో సురేశ్‌రెడ్డి పాదయాత్ర

**జీడిమెట్ల, డిసెంబరు 28, ప్రభాతవార్త :** సుభాష్‌నగర్ డివిజన్‌లో గల జెకె నగర్, శ్రీ సాయి వెంకట ఎంక్లేవ్‌లలో నెలకొన్న సమస్యలు తెలుసుకొనుటకు ఆదివారం మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి కాలనీ వారి ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రలో భాగంగా కాలనీలోని డ్రైనేజీ, సిసి సమస్యలను తెలుసుకున్న సురేశ్‌రెడ్డి వివిధ సమస్యలను అక్కడి నుండే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను తెలపడం జరిగింది. త్వరలోనే దశల వారీగా కార్పొరేటర్ సహకారంతో, ఎమ్మెల్యే సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని సురేశ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సురేశ్ రెడ్డి వెంట డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, శివాగౌడ్, జహంగీర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



స్థానికులతో కలిసి పాదయాత్ర చేస్తున్న సురేశ్‌రెడ్డి



టియు.జెఏసి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.యాదగిరి

## తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు చేయాలి : యాదగిరి

**అడ్డగుట్ట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ కారులకు ఇంటి స్థలాలు, రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలని, అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని టీ.యు.జెఏసి ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి తెలిపారు. ఆదివారం అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. టీ.యు.జెఏసి రాష్ట్ర నాయకులు మోత్కూర్ మల్లేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శారద, ప్రకృద్దీన్, జయక్రిష్ణ, యాదగిరి,రాజు గౌడ్, చంద్రకళ పాల్గొన్నారు.

## 'ఉచిత బ్రేక్‌ఫాస్ట్ పంపిణీకి ఐదేళ్లు'

**జీడిమెట్ల, డిసెంబర్ 28, ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ 320 బి డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాం రాజ్ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి సమీపంలో నిత్యం ఉదయం పేదలకు అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల నుంచి చేస్తున్న సేవలకు గుర్తింపుగాను డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాం రాజ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులుకు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక కార్యక్రమాన్ని నిరంతరాయంగా ఐదేళ్ళ పాటు నిర్వహించడం గొప్పవిషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ టి.రాజేంద్రప్రసాద్, జిఈటి కోఆర్డినేటర్ ఎస్ ఎన్ రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతిరెడ్డి, డిసి అంగర్ రిలిఫ్ రాందాస్, రిజియన్ చైర్‌పర్సన్ సురేశ్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజేయులు, మాజీ అధ్యక్షులు కృష్ణ, కిషోర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ జాదవ్, సిద్దారెడ్డి, సినియర్ లయన్స్ క్లబ్ సభ్యులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన కృష్ణ కుచేల పద్య పౌరాణిక నాటకం

**చిక్కడపల్లి డిసెంబర్ 28 ( ప్రభాతవార్త) :** పోతన రచించిన భాగవతంలోని పౌరను కథే కావొచ్చు కానీ అందులోని సందేశం మాత్రం మనుష్య జాతి అంతటికీ ఏ కాలం లో అందించే సందేశం ఈ సందేశం తెలియ చేస్తూ అమరలింగ శర్మ రచించిన కృష్ణ కుచేల పద్య పౌరాణిక నాటకం డాక్టర్ సూల పాణి దర్శకత్వం లో ఆరాధన సాంస్కృతిక సంస్థ నిర్వాహణలో శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గానసభ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 17 వ పద్య నాటకోత్సం లో భాగంగా ప్రదర్శించారు యాదవ రాజ్య వారసుడు ఇన కృష్ణుడు పేద బ్రహ్మణుడు కుచేలుడు బాల్యం లో సందేపుని శిష్యులు. క్రమంగా వారు వేరు వేరు జీవితాల్లో స్థిరపడినా కుచేలుడు సంసార భారం మోయలేకి భార్య ప్రేరణ మేరకు ద్వారక రాజ వంశీకుడు ఇన కృష్ణుడు వద్దకు వెడతారు కృష్ణుడు తనను తన్ని పట్టించుకోడనీ అనుమానిస్తూ వెళ్లగా కృష్ణుడు ఎదురేగి ఆలింగనం చేసుకొని తన సింహాసనం పై కూర్చిన బెట్టీ తాను కుచేలుని పాదాల వద్ద కూర్చుని కబుర్లు చెబుతారు ఇదీ స్నేహం ధర్మం అనే సందేశం కుచేలుడు గా సుల పాణి కృష్ణునిగా డాక్టర్ మయూరి రుక్మిణి గాహరిత ద్వార పాలకుడి గా రాఘవేంద్ర స్వామి లు నటించి ప్రేక్షకులు ను రంజింప జేశారు సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొనగా యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించి కళా కారులు ను సత్కరించారు వేదిక పై లోకం కృష్ణయ్య వి వి రాఘవ రెడ్డి భాస్కర గుప్తా రఘు శ్రీ తదితరులు పాల్గొన్నారు మోహన కృష్ణ వ్యాఖ్యానం సందర్భిచితం గా ఉంది.

## శ్రీగిరి ఆలయ కేలండర్ ఆవిష్కరణ

**సికింద్రాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ముఖచిత్రాలతో ప్రత్యేకంగా రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతు ఈనెల 30వ తేది వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి కేలండర్‌ను భక్తులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనంతోపాటు తులసీదళార్చన, వేద ఆశీర్వాదం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు,ఆలయ కమిటి ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామ సూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, షన్ముఖరెడ్డి, రాములతోపాటు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

## ఆటో డ్రైవర్ల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలి

### తెలంగాణ ఆటో యూనియన్ జెఏసి

**సైఫాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ఈ నెల 29వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డుపై ప్రకటనచేసి తక్షణమే అమలులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో యూనియన్ల జెఏసి (నాన్–పొలిటికల్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఏసి అధ్యక్షుడు మంద రవికుమార్, ఉపాధ్యక్షుడు దస్తగిరి తదితరులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు ఆనేక హామీలు ఇచ్చి నేటికి ఏఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. పార్టీ ఇచ్చిన హామీలకు ఆశతో 7లక్షలకు పైగా ఉన్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం కారణంగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఇప్పటి వరకు 163 మంది మృతి చెందారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మృతి చెందిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోతే జెడ్‌పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో నిరసనలు తెలుపుతూ తమ సత్తా చూపిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఏసి నాయకులు సాయిలు, ఖాదర్, ఇస్మాయిల్, అవినాష్, రాజునాయక్, ఇర్ఫాన్, అకాష్ పాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోకాలను వల్లించిన చిన్నారులు

చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 28 ప్రభాతవార్త : ఉప్పుగూడ హనుమాన్‌నగర్ శ్రీ మంగళముఖి హనుమాన్ దేవాలయంలో ప్రతి ఆదివారం చిన్నారులకు భగవద్గీతలోని పలు అధ్యాయాలు, శ్లోకాలను వల్లెవేయిస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో గణపతి రవికుమార్, గిరిజల ఆధ్వర్యంలో విద్యార్థులకు అర్జున విషాద యోగంలోని శ్లోకాలను నేర్పించారు. వాటి టీకా తాత్పర్యాలను వివరించారు. చిన్నారులు ఎంతో ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. సంస్కార్ సేవా ఫౌండేషన్, ఆలయ ప్రతినిధులు, 85 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

## రోడామిస్త్రీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

### పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, డిసెంబర్ 28, ప్రభాతవార్త :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.ఆదివారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279 డివిజన్ రోడమేస్త్రీ నగర్ శ్రీరాం నగర్ బస్టాప్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పురాతన పార్టీ కాంగ్రెస్ అని, అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, సిద్దనోల్ల సంజీవరెడ్డి, పండరి రావు, ఎండి. లయక్, అరుణ్, అజయ్, గఫ్ఫార్, మహేష్, లక్ష్మీ ్మ, కామేష్, రహీమ్, అహ్మద్, విశాల్, రమేష్, శశికళ, సరస్వతి, రాణి, రమేష్, రామచందర్, నరసింహ పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయం ఎదుట...



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**నిజాంపేట్, డిసెంబర్ 28, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ వీరేందర్ రెడ్డిలు జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడియాల ఇందిరా, రఫియా బేగం, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ జనార్ధన్ రెడ్డి, వరగాని వాసు, ఏలూరి సత్య (నాని) కృష్ణంరాజు, చిట్ల దివాకర్, వీరబాబు, శ్రీశైలం యాదవ్, మోలేశ్వరరావు, మద్ది నారాయణరెడ్డి, రమేష్, వర్మ రాజు, ఎర్రోళ్ల విష్ణు, బిక్కన్ షా, జగదీష్ యాదవ్, ప్రేమ్ కుమార్, జగన్ యాదవ్, అల్లాడి మహేష్, రామచంద్రనాయక్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆలయంలో పూజలు చేసిన లక్ష్మణ్ ప్రసాద్

**కంటోన్మెంట్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ఈస్ట్ మారేడ్‌పల్లి, మహేంద్రహిల్స్,శాంతిని కేతన్ కాలనీలోని శ్రీ దుర్గామాత దేవాలయంలో నిర్వహించిన పూజలకు తుకారాంగేట్ శ్రీపహాడి హన్మాన్ దేవాలయం చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్ లల్లూ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చెలుకులు, విసుర్లు, వెలుగుల పరిపుష్టి 'నానీల ఖజానా'

### తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు రమణాచారి

నాంపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త :

**నాంపల్లి, డిసెంబరు 28 ప్రభాతార్త :** చిమ్మపూడి శ్రీరామమూర్తి రచించిన 2025 నానీల ఖజానాలో చెలుకులు, విసుర్లు,వెలుగుల పరిపుష్టిగా వయస్సులతో నిమిత్తం లేకుండా పాఠకుల హృదయాలను దోచుకుని పదిలంగా ఉండిపోయే రీతిలో అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యా లయంలో దాస్యం సేనాధిపతి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్టఅతిథులు శ్రీభాష్యం యదు మోహన్, డా. వై.రామకృష్ణారావు, డా. పోరెడ్డి రంగయ్య, ఫౌండేషన్ అధ్యక్షుడు, రచయిత చిమ్మ పూడి శ్రీరామమూర్తి, రవికుమార్, పొన్నాల శ్రీరాములు, కృష్ణమోహన్, మంగపతిరావు, డా. కేతవరపు రాజ్యశ్రీ తదితరులతో కలిసి చిమ్మపూడి శ్రీరామమూర్తి రచించిన నానీల ఖజానా గ్రంథాన్ని విష్కరించి ప్రసంగించారు. నానీల ఖజానాలోని కొన్ని నానీలను ఉటంకిస్తూ 'చేయి చాపకు తిరస్కరి స్తారు, చేయికలుపు నమస్కరిస్తారు; భర్త కుంగి నప్పుడు కళ్లు తుడవడానికే భార్య కొంగు; పెళ్లిముందు రింగింగ్.. తర్వాత హియరింగ్.. ఆ తర్వాత ఫియరింగ్... షివరింగ్... బేరింగ్, మిగతా జీవితమంతా బోరింగ్; వంటి నిత్య సత్య పదాలతో పద్యాల్లో ఉండే పరిమళం, ప్రౌఢత్వం నానీల్లో తీసుకొచ్చారని, రచయిత ఎత్తుకున్న ఎన్నుకున్న పాదాలు చూస్తుంటే అవి సరస్వతి పాదాలని అలా గొప్పగా వ్రాసారని ప్రశంసించారు. చివరిగా రచయిత శ్రీరామమూర్తిని ఘనంగా సత్కరించారు.




నానీల ఖజానా గ్రంథావిష్కరణ చేస్తున్న రమణాచారి, సేనాధిపతి

IN THE COURT OF THE HON'BLE 1st SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD.
S.O.P.No. 143 of 2025
Between:
**Sri Narsimha Sarode & others** ...Petitioners.
And
**Kotak Securities Ltd & another** ... Respondents.
To
**All Concerned.**
Please take notice that the Petitioners have filed the above Succession O.P. seeking to issue a Succession Certificate in their favour, declaring them as the lawful successors of **Late Smt. Manorama Devi Sarode**, wife of **Sri Narsimha Sarode** in respect of holdings/securities stands in her name and the said S.O.P. is posted to **30-01-2026**. If, any person or persons have any objections to the Petitioners claim they may appear before this Hon'ble Court on **30-01-2026 at 10:30 A.M.**, either in person or through their counsel, and present their objections if any, failing which, the matter will be decided by the Court in accordance with law.
//By order of the Hon'ble Court\\
**M/s. K. Venkat Ram Reddy**
**B. Yadagiri**
**B. Narender Reddy**
**Advocates**
86-SRT, Municipal Colony, Malakpet, Hyderabad.
**9848227771, 9948094495.**

IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT :: L.B. NAGAR
I.A.No. 1405 of 2023
in
O.S.No. 176 of 1999
Between:-
**Smt. M. Geetha** W/o. M. Sanjeeva Reddy. ...Petitioner/Plaintiff.
and
**Bokka Madhusudhan Reddy and another.** ...Respondents/Defendants.
To,
**R3). Bokka Jayamma** W/o. Bokka Madhusudhan Reddy, Age: 58 years, R/o. Flat No.206, Annapurna Residential Complex, 17-85, Road No.1, Kamalanagar, Beside Sreehitha Hospital, Chaitanyapuri, R.R. District.
**R4). Bokka Sai Teja Reddy** S/o. Bokka Madhusudhan Reddy, Age: 33 years, R/o. H.No.6-99, Durga Nagar, Injapur Village, Abdullapurmet Mandal, R.R. District.
**R5). B. Mani Deep Reddy** S/o. Bokka Madhusudhan Reddy, Age: 31 years, R/o. H.No.6-99, Durga Nagar, Injapur Village, Abdullapurmet Mandal, R.R. District.
Whereas the above named Petitioner/ Plaintiff has filed the above Petition against the Respondents/ Defendants, praying above Hon'ble Court to appoint an advocate commissioner to partition and thereby demarcate and fix the boundaries of 1/3rd share each of the Suit Schedule Properties A and B with metes and bounds as per the Preliminary Decree to me/the Petitioner/ Plaintiff and the Respondents No.1 and 2/Defendants No.1 and 2, by taking the assistance of expert surveyor and to file a report to that affect, in the interest of justice.
You the above named Respondents no.3 to 5/Defendants No.3 to 5 i.e. Legal Heirs of Respondents no.1/Defendant no.1 take notice that, the above case is posted on **28-01-2026 at 10.30 am** for your appearance and counter, if any, and if you failed to appear before the above Hon'ble Court either in person or through advocate, otherwise the matter will be decided in your absence.
//BY THE ORDER OF THE COURT//
**Sd/- KAMTALA SREENIVAS**
**Advocate**
H.No.11-6-141, Pochammabagh Colony, Saroornagar, Hyderabad-500035. **Cell No. 9440129813**
**Counsel for the Petitioner/Plaintiff**



జాతరలో పాల్గొన్న ఎలికట్ట వాసులు

# జోరుగా.. హుషారుగా.. గంప జాతర

**ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపిన ఎలికట్ట వాసులు**

**ఆప్యాయతలు పంచిన సామూహిక భోజనాలు**

**షాద్‌నగర్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** జాతర అంటే ఎక్కడో దూరంగా పుణ్యక్షేత్రాల ముంగిట కాదు.. పుట్టిన పల్లె ముంగిట.. పచ్చదనాలు నిండిన చెట్ల మధ్యన.. సస్యశ్యామలమైన పంట పొలాల సందిట.. స్వచ్ఛమైన వాతావరణపు ముంగిట.. పల్లె వాసులంతా ఒక్కటిగా కదిలి.. తంగేడు చెట్టు పూజలు, అడవి తల్లికి అభిషేకాలతో తమ పల్లె పచ్చగా ఉండాలని కోరుకుంటూ చేసే సందడి. కలిసి భోజనాలు చేసే అందమైన హడావిడి.. దీనినే గ్రామీణ ప్రాంతాలలో గంప జాతరగా పిలుస్తారు.. ఈ పేరు చెప్తేనే పల్లెవాసులు మైమరుస్తారు.. అలాంటి ఒక అందమైన వేడుకకు వేదికగా మారింది ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామం.. ఈ గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించిన గంప జాతర పల్లె వాసులను అలరించింది. సకల సంతోషాలను రోజంతా అందించింది.. ప్రతి మోములో చిరునవ్వులు చిందించింది..

**ఇదీ జాతర కథ..**

తమ పల్లె సీమ ఎప్పటికీ పచ్చగా ఉండాలి.. చూడ చక్కగా పంటలు పండాలి.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి.. ఎలాం టి రోగాలు పల్లె దరిదాపులకు రాకూడదు.. ఎలాంటి అరిష్టాలు, కరవు కాటకాలు తమ పల్లెను తాకకూడదు.. అన్న ఒక మంచి ఉద్దేశంతో అనాదిగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ ఉత్స వాలను చేపడుతున్నారు. గ్రామస్తులు ఎంత పల్లె శివారులో తోటలు, చెట్ల సమూహంలోకి వెళ్లి అక్కడ తంగడ చెట్టును భక్తితో పూజించి, అడవి తల్లికి పూజలు చేస్తారు. అడవి తల్లి సన్నిధిలో నివసిస్తున్న తమ పల్లెసీమలో ఇలాంటి అనర్థాలు జరగకూడదని భక్తిగా అమ్మ వారిని ప్రార్థిస్తారు. అనంతరం అక్కడే వంటలు చేసుకుని సామూ హికంగా భోజనాలు చేస్తారు. ఇక చిన్నారులు, యువకులు ఆట పాటలు నృత్యాలతో అలరిస్తే, మహిళలు భక్తి పాటలతో వివిధ రకాల ఆటలతో తమదైన ముద్ర వేస్తారు. ఇలా ప్రతి ఏటా గ్రామీణ ప్రాంతాలలో ఈ వేడుకలు జరగడం సంప్రదాయంగా వస్తుంది. అదే సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తూ ఎలికట్ట గ్రామవాసులు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

**సరదా.. సరదాగా..**

నిన్న మొన్నటి దాకా జరిగిన సర్పంచ్ ఎన్నికల హడావిడి తర్వాత గ్రామస్తులందరూ ఊరటగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో వెళ్లి యధావిధిగా పూజా కార్యక్రమాలు, వంటలు, బంతి భోజనాలతో హడావిడి చేశారు. చిన్నారులు ఒకవైపు గాలిపటాలు ఎగరవేస్తూ తమ సరదాలు తీర్చుకోగా, యువకులు నృత్యాలతో సందడి చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి సంబంధించిన ప్రముఖులు కూడా పాల్గొన్నారు. అందరూ కలిసి ఆనందంగా వేడుకను జరుపుకొని మురిసిపోయారు. గంప జాతర ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, ఇది పల్లెసీమలో అనర్థాలను కూడా దూరం చేస్తుందని గ్రామస్తులు వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాన్ని కలిసికట్టుగా అందరం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వారు తమ అభిప్రాయాలను తెలియజేశారు.

## రాజేంద్రనగర్‌లో ఫామ్‌హౌస్‌లు సీజ్

**మొయినాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌జోన్‌లో ఫామ్‌హౌస్‌ల తనిఖీ నిర్వహించారు. రాజేంద్ర నగర్ జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ ఐపిఎస్. పర్యవేక్షణలో చేవెళ్ల ఎసిపి కిషన్, ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జోన్‌లోని ముగ్గురు సిఐలు, ఏడుగురు ఎస్ఐలు, 70 మంది సివిల్ ,ఎఆర్ సిబ్బందితో కలిసి ఈ దాడులు నిర్వహించారు.

మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీజ్ నగర్, నాగిరెడ్డిగూడ, సురంగల్, శ్రీరామ్‌నగర్, కుత్బుద్దీన్‌గూడ గ్రామాల పరిధిలోగల సుమారు 50 ఫామ్‌హౌస్‌లను తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పార్టీ నిర్వాహకులు, ఫామ్‌హౌస్ ఓనర్‌లపై కేసులు నమోదుచేశారు. గోల్డన్ మేడ్వోస్ ఫామ్‌హౌస్ కుత్బుద్దీన్‌గూడ, జెడ్‌ఏఏ ఫామ్‌హౌస్ అజీజ్‌నగర్, గున్నా ఫామ్‌హౌస్ కుత్బుద్దీన్ గూడ ఫామ్‌హౌస్‌లపై కేసులు నమోదుచేసినట్లు డిసిపి యోగేష్ గౌతమ్ తెలిపారు. ఫామ్‌హౌస్ ఓనర్, పార్టీ నిర్వాహకులు తగిన ప్రభుత్వ అనుమతులు తీసుకొని పార్టీలు నిర్వహించుకోవాలని స్పష్టంచేశారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లిక్కర్ పార్టీలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు మత్తు పదార్థాలు, సేవంచడం, గంజాయి, డ్రగ్స్, హుక్కా, గాంబ్లింగ్, బెట్టింగ్, వ్యభిచారం వంటివి, నిర్వహిస్తే ఫామ్‌హౌస్‌లను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫామ్‌హౌస్ ఓనర్లపై అదేవిధంగా పార్టీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. న్యూయర్ పార్టీలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించు కోవాలని సూచించారు.



పాఠశాలలో మంచినీటి ట్యాప్‌లను ప్రారంభిస్తున్న సిద్ధార్థరెడ్డి

## చదువుల బడికి రూ.6.5 లక్షల విరాళం

**గ్రామస్తుడు సిద్ధార్థరెడ్డి ఔదార్యం**

**అభినందించిన పాఠశాల సిబ్బంది**

**కొత్తూరు, డిసెంబరు 28 ప్రభాతవార్త:** కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మామిడి వసుంధరమ్మ కుమారుడు మామిడి సిద్ధార్థ రెడ్డి తన సొంత ఖర్చులతో రూ.6 లక్షల 50 వేల రూపాయల విరాళాన్ని అందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించాలనే సంకల్పంతో పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం, స్కూల్ భవనానికి గ్రిల్స్ ఏర్పాటు, తాగునీటి వసతి, హ్యాండ్ వాష్ సదుపాయం, వాటర్ లైన్ వంటి మౌలిక వసతులను పూర్తిగా తన స్వంత వ్యయంతో ఏర్పాటు చేసి విద్యార్థులకు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల అత్యంత అవసరమని, చిన్న వయసులోనే విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తే వారి భవిష్యత్ మరింత బలపడుతుందన్నారు. తరగతి గదుల అభివృద్ధి, సౌకర్యాల కల్పన ద్వారా విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి పట్ల మామిడి సిద్ధార్థ రెడ్డి చూపిన సేవా భావాన్ని గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రశంసించారు. విద్యాభివృద్ధికి ఇలాంటి సహకారం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

## రెండు నెలలు గడువు ఇస్తున్నాం

**డంపింగ్‌యార్డు తొలగించకపోతే జాగృతి రంగంలోకి దిగుతుంది**

**మేమే ఆ పని చేస్తాం**

**ఎమ్మెల్సీ కవిత**

**ఆమనగల్లు, డిసెంబరు ప్రభాతవార్త:** ప్రభుత్వ పాలన వైఫల్యంతో రాష్ట్రంలో ప్రజా జీవితం ప్రమాదంలో పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్య తిరేక విధానాలను జాగృతి ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తున్నామని ఆమె అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఆదివారం కల్వకుంట్ల కవిత ఆమనగల్లును సందర్శించారు. గుర్రం గుట్ట కాలనీలోని ప్రభుత్వ డంపింగ్ యార్డును ఆమె సందర్శించి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకి ఫిబ్రవరి వరకు గడువు ఇస్తున్నం అప్పటి వరకు జాగృతి చేపట్టిన యాత్ర అయిపోతుంది అప్పటి వరకు డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించకపోతే ఫిబ్రవరిలో స్వయంగా జాగృతి రంగంలోకి దిగి డంపింగ్‌యార్డు తరలించే ప్రయత్నం చేస్తామని ప్రజల హర్షధ్వానాల మధ్య కవిత తెలిపారు. కార్యక్రమలో పలువురు జాగృతి నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్‌కు సవాల్





**గంజాయ్ బ్యాచ్**

- గతేడాదికంటే ఈయేడాది జిల్లాలో 3.31 శాతం కేసులు అధికం
- సర్పంచ్ ఎన్నికల తర్వాత నేరాల్లో కీలక హస్తం
- ఉన్మాదంతో విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్న వైనం
- ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా
- రైళ్లలో బాహాటంగా తరలిస్తున్నా అదుపు చేయలేకపోతున్న పోలీసులు
- ఫలితమివ్వని సోదాలు, అరెస్టులు
- జైలు నుంచి బయటకు వచ్చిన కొద్దికాలానికే తోకజాడింపు
- పరిస్థితి చేయిదాటి పోయిందని సర్వత్రా ఆందోళన
- ఉక్కుపాదం మోపటానికి స్పెషల్ ఫోకస్ పెట్టిన ఎస్పి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఒకప్పుడు బిచ్చగాళ్లకే పరిమితమైన గంజాయి ఇప్పుడు చదువుకున్న యువతను కూడా వదలడం లేదు. ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ విద్యార్థుల వరకు, పాలేర్ల నుంచి దినసరి కూలీల వరకు చాలామంది గంజాయికి బానిసలుగా మారుతున్నారు. దీనిని సేవించిన తర్వాత ఉన్మాదులుగా మారుతున్నారు. చట్టం, న్యాయం, ధర్మం వంటివేమీ కనిపించడం లేదు. నేరాలకు పాల్పడుతూ కటకటాల పాలవుతున్నారు. అయినా సమాజం గంజాయి పీడ నుంచి విముక్తి పొందడం లేదు. ఒరిస్సా, వైజాగ్ ప్రాంతాల నుంచి నిత్యం రైలు, రోడ్డు మార్గాల గుండా గ్రామాల వరకూ గంజాయి సరఫరా అవుతున్నా అరికట్టడం సాధ్యం కావడం లేదు. అడవుల్లో ఉండే మావోయిస్టులను ఏరిపారేసే సాంకేతిక పరిజ్ఞానం గల పోలీసుశాఖ గంజాయి వంటి మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టక పోవడం విచారకరమని అంటున్నారు. పోలీసు, ఆబ్కారీ, టాస్క్‌ఫోర్స్ విభాగాలను మరింత పదును పెట్టాల్సిన తరుణం ఆసన్న మైంది. వికారాబాద్ జిల్లాలో ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎస్పి స్నేహా మెహ్రా గంజాయిని అరికట్టేందుకు ఫోకస్ పెట్టారని తెలిసింది. ఒరిస్సాలోని పలు ప్రాంతాలు గంజాయి పంటకు ప్రసిద్ధిగాంచాయి. సుమారు 25ఏళ్లుగా గంజాయి సాగు చేస్తూ వైజాగ్, హైదరాబాద్, ముంబాయి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఆరంభంలో పెద్దగా డిమాండ్ లేనందున వారానికి ఒకటి లేదా రెండుసార్లు ముంబాయి వెళ్లే రైళ్లలో తరలించేవారు. గత పదేళ్లుగా గంజాయి సేవించే వారి సంఖ్య క్రమంగా పెరుగూ వచ్చింది. ఇప్పుడు తెలంగాణ పల్లెలకూ గంజాయి విస్తరించింది. ప్రత్యేకించి యువకులు బానిసలుగా మారుతున్నారు. కాలేజీల ఆవరణ వరకూ గంజాయి సరఫరా చేసే బ్యాచులు వచ్చేశాయని సమాచారం.

**రైళ్లలోనుంచి పట్టణాలకు కి.మి దూరంలో డంపింగ్**

దాంతో ఒరిస్సాలో గంజాయి సాగు పదిరెట్లు పెరిగినట్లు సమాచారం. అక్కడ నుంచి రోజూ రైళ్లలో తెలుగు రాష్ట్రాలకు, ముంబాయి నగరానికి రవాణా పెరిగిందని విశ్వనీసయవర్గాల సమాచారం. రైల్వేశాఖ కళ్లుగప్పి బోగీలలో గంజాయి సంచులను తరలిస్తున్నారా, లేక వారికీ సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ జరిపించాలని డిమాండ్లు వస్తున్నాయి. రైళ్లలో వస్తున్న గంజాయి పట్టణాలకు కిలోమీటరు దూరంలోనే సంచులను బయటకు పడేస్తున్నట్లు తెలిసింది. కొన్ని సందర్భాలలో దర్జాగా ప్లాట్ ఫారాలపై దించుకుని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇలా రోజూ వస్తున్న గంజాయి ఇటీవల ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో కూడా రవాణా జరుగుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పరిస్థితి చేయిదాటి పోయిందని ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రగ్స్ కంటే ఎక్కువగా గంజాయి బ్యాచ్‌లు పట్టణాల్లో తిరుగుతున్నాయని అంటున్నారు. తరచూ పోలీసు, ఎక్సైజ్‌శాఖల అధికారులు గంజాయి పట్టుకుని నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నారు. అయినా తంతు ఆగడం లేదు. దీన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలంటే సాగు చేసే స్థావరాలపైనే దాడులు చేయాలని అంటున్నారు.




- వాహనాలకు సైరన్‌తో అనధికార హోదా
- ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పుకుని చీటింగ్ చేస్తున్న కేటుగాళ్లు
- ఫలానా మంత్రిగారి తాలుకా అంటూ బుకాయింపు
- డ్రంక్ అండ్ డ్రైవ్ నుంచి తప్పించుకోవటానికి కన్నింగ్ వేషాలు
- బైక్‌లకు స్టిక్కర్లతోనూ నకిలీపాత్రికేయుల హల్‌చల్

**షాద్‌నగర్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** గుంపులు గుంపులుగా జనాలు.. విపరీతమైన వాహనాల రద్దీ.. ఈ మధ్యలో సైరన్ మోగించుకుంటూ ఓ వాహనం.. అయితే అంబులెన్స్.. లేదంటే పోలీస్ వ్యాన్.. ఇంకా కాదనుకుంటే ఎవరో ప్రజా ప్రతినిధులు లేదా విఐపిలు అనుకొని వాహనాలన్నీ లైన్ క్లియర్ చేస్తాయి.. తీరా చూస్తే అందులో దర్శనం ఇచ్చేది బిల్లిబిత్తరి గాళ్లు.. ఎలాంటి హోదా లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా ఇలా సైరన్ మోగిస్తూ వాహనాలు నడిపే బిల్డప్ బాబుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. సైరన్ సౌండ్ వినగానే దారి ఇచ్చే జనం కూడా ఇలాంటి వాళ్ళ కారణంగా అవస్థలు పడాల్సి వస్తోంది.. దీనికి తోడు వాహనాలపై ప్రజా ప్రతినిధుల స్టిక్కర్లు, ప్రెస్ బోర్డులు తగిలించుకొని ఇష్టారాజ్యంగా పోలీసులను తప్పుదారి పట్టిస్తూ తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

**పోలీసుల కన్ను కప్పటానికే..**

వాహనాలకు సైరన్ వేసుకొని అత్యవసర పరిస్థితుల్లో చప్పుడు చేసుకుంటూ ముందుకు వెళ్లే అవకాశం కొంతమందికి మాత్రమే ఉంది. విపత్కర పరిస్థితులలో రోగులను ఆసుపత్రికి చేర్చే అంబులెన్స్, అత్యవసర పరిశోధనల మీద వాహనాల్లో తిరిగే పోలీసులు, అత్యవసర కార్యక్రమాల కోసం పర్యటనలు చేసే మంత్రులు, ముఖ్యమంత్రి లాంటి వాళ్లకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ఎవరికి పడితే వారికి సైరన్లు మోగించే అవకాశం లేదు. ఇది నిబంధనలకు విరుద్ధం. కానీ ఇవేవీ లేకపోయినా తమ వాహనాలకు సైరన్లను తగిలించుకొని కొంతమంది ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. అటు ప్రజలను, ఇటు పోలీసులను పక్కదారి పట్టిస్తూ ముందుకు సాగుతున్నారు. తీరా ఎప్పుడైనా పోలీసులు అత్యవసర పరిస్థితుల్లో తనిఖీలు చేసినప్పుడు ఇలాంటివి కుప్పలు తిప్పలుగా వెలుగుతున్నాయి. పైకి సైరన్.. ఏ మినిస్టర్రో, అధికారో.. విఐపిలు అనుకొని తలుపులు తీస్తే కనిపించేది బిల్లి బిత్తిరి గాళ్లు. ఇక అంబులెన్సు కూడా పేషెంట్లు లేకపోయినా సైరన్ తగిలించుకుంటూ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వేగంగా వెళుతూ ఇతర వాహనాలను ఇబ్బందులు పెడుతున్న సందర్భాలు చాలా ఉన్నాయి. ఇది మాత్రమే కాకుండా ఎమ్మెల్యే స్టిక్కర్లు, ప్రెస్ బోర్డులు తగిలించుకొని కొంతమంది పోలీసుల నుంచి తప్పించుకునేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇవి బయటపడినప్పుడు చర్యలు కఠినంగా ఉండకపోవడంతో ఇష్టారాజ్యంగా ఈ వ్యవహారం కొనసాగుతుంది. బార్లలో కూర్చొని ఎంచక్కా బీర్లు కొట్టి ఎవరికి అనుమానం రాకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కాకుండా ఉపయోగపడేలా సైరన్ మోగించుకుంటూ వెళుతున్నారు పలువురు మందుబాబులు. పొలిటికల్ లీడర్ల వలే తెల్ల చొక్కా వేసుకొని, కళ్ళజోడు పెట్టుకొని ఎమ్మెల్యే, మంత్రుల పేర్లు చెప్పుకొని పలువురు ఇదే తరహాలో పబ్బం గడిపే సుకుంటున్నారు. మంత్రులు, ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వంటి ప్రముఖులకు బంధువులని చెప్పుకుంటూ కొంతమంది, అనుచరగణం అని చెప్పుకుంటూ మరికొందరు దర్జాగా ఇలాంటి సైరన్‌పెట్టేసుకుని అనధికార హోదా వెలగపెట్టేస్తూ పోలీసుల జరిమానాలు తప్పించుకుంటున్నారు.

**స్టిక్కర్ల దుర్వినియోగం?**

గతంలో జూదం వ్యవహారంలో ఈడీ నిర్వహించిన సోదాల్లో సదరు నిందితుని కారుకు ఓ మంత్రి స్టిక్కర్.. ఉండడంతో తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు రేపాయి. సోదాల్లో భాగంగా ఈ విషయాన్ని ఈడీ అధికారులు గుర్తించారు. మరోచోట పార్లమెంటు సభ్యుడిగా ఓ ఎంపి వినియోగించే విఐపి వాహన స్టిక్కర్ నకిలీది సృష్టించి వాడుకుంటున్నారని స్వయంగా ఆయనే ఆరోపించారు. గతంలో అప్పట్లో బోధన్ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న కారు రాజధానిలో బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ప్రమాదానికి గురైన కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్ కనిపించింది. అప్పట్లో ఈ స్టిక్కర్ తనదేనని..కానీ ఆ కారు తనకు తెలిసిన బంధువుల వాళ్లదని చెప్పుకొచ్చారు. ఈ విధంగా స్టిక్కర్ల ఉన్న వాహనాలతో ఎమ్మెల్యే, ఎంపిల బంధువులు, అనుచరులు రోడ్లపై యదేచ్ఛగా తిరుగుతున్నారు. దీంతో పోలీస్ ఉన్నాతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరతున్నారు.



విషం కలిసిన కల్లు కుండలు

## ఈత కల్లులో విషం

**మాడ్గుల, డిసెంబరు 28, ప్రభాతవార్త:** మాడ్గుల మండలంలోని ఆర్కపల్లిలో కొంతమంది దుండగులు ఈత కల్లులో పురుగుల మందు కలిపారు. వివరాల్లోకి వెళితే.. కల్లుగీత కార్మికుడైన యాచారం శ్రీనివాస్ గౌడ్ తన వృత్తి పనుల్లో భాగంగా శనివారం సాయంత్రం ఈత చెట్టుని గీసి లొట్లు కట్టాడు. ఆదివారం ఉదయం లొట్లు విప్పటానికి వెళ్లగా.. అందులో పురుగుల మందు కలిపారని గుర్తించాడు. వెంటనే స్థానికులతో కలిసి సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డిలకు సమాచారం ఇవ్వగా.. గ్రామ పెద్దలు మాడ్గుల సిఐ వేణుగోపాలరావు, ఎక్సైజ్ సీఐ బధ్య చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేపడతామని సిఐ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మనుషులు తాగే ఈత కల్లులో ఇలాంటి విషపూరితమైన మందులు కలపడం మంచి పద్ధతి కాదన్నారు. ఎవరిని హతమార్చడానికి ఇలాంటి పన్నాగం పన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మున్సిపల్ అధికారులకు స్థాన చలనం

**తూంకుంట మున్సిపల్ కమిషనర్‌ను తార్నాక సర్కిల్‌కు బదిలీ**

**జవహర్‌నగర్ కమిషనర్ కీసర సర్కిల్‌కు..**

**జిహెచ్‌ఎంసిలో విలీనం ఎఫెక్ట్**

**శామీర్‌పేట, డిసెంబరు 28, ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసిలో శామీర్‌పేట డివిజన్ ఏర్పాటు కావటంతో పెద్ద గ్రామాలుగ ఉన్న శామీర్‌పేట, తూంకుంట, దేవరయాంజాల్, తదితర ప్రాంతాల్లో రాజకీయ వేడి ఆరంభమైంది. అయితే తూంకుంట డివిజన్‌ను శామీర్‌పేట డివిజన్‌గా పేరు మారటంతో తూంకుంటలో పలువురిలో అసంతృప్తిలు, శామీర్‌పేటలో పలువురిలో సంతోషం వ్యక్తం అవుతూ డివిజన్ ఏర్పాటు విషయం చర్చనీయాంశంగ మారింది. అయితే జవహర్‌నగర్ కమిషనర్ ఎన్.వసంత జిహెచ్‌ఎంసి కీసర సర్కిల్‌కు బదిలీ అయ్యారు. మరోవైపు తూంకుంట మున్సిపల్ కమిషనర్‌గా, డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఎంఎన్ఆర్ జ్యోతి జిహెచ్‌ఎంసి తార్నాక సర్కిల్ కార్యాలయంకు బదిలీ అయ్యారు. జిహెచ్‌ఎంసిలో శివారు మున్సిపాల్టీల విలీనాలు, జోనల్స్, సర్కిల్స్, డివిజన్ల ఏర్పాటుతో సంబంధిత అధికారులను బదిలీలు చేశారు. జిహెచ్‌ఎంసి విస్తరణలో భాగంగ పనిచేసిన కమిషనర్లుగా కొన్నాళ్ల పాటు ఆ తరువాత జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్లుగా విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. గతంలో పనిచేసిన వారిని వివిధ జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయాలకు బదిలీలు చేయటం జరిగింది. శుక్రవారం రాత్రి ఈ మేరకు ఉత్తర్వులు జారీ కావటంతో బదిలీల ప్రక్రియ కొనసాగింది. తూంకుంట మున్సిపాల్టీగ ఉన్న దాన్ని ఇక శామీంపేట డివిజన్‌గా పేరు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

## యువత తలుచుకుంటే మార్పు తథ్యం

**ప్రధాన సమస్యలన్నింటినీ తీర్చే బాధ్యత తీసుకుంటా**

**సల్బత్తాపూర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీ**

**బంట్వారం. డిసెంబరు 28. ప్రభాతవార్త :** సల్బత్తాపూర్ గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన బుర్నాపూర్ బాలయ్య ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందడంతో ఆదివారం గ్రామ పెద్దలు ఉద్యోగస్తులు, విద్యావంతులు, యువకులతో కలిసి హైదరాబాద్ లోని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గామ యువకులు, పెద్దలు గ్రామంలోని సమస్యలపై, అభివృద్ధి అంశాలపై స్పీకర్‌తో చర్చించారు. ముఖ్యంగా గ్రామంలో ప్రధానంగా నీటి సమస్య, అండర్ డ్రైనేజ్, అంతర్గత రోడ్లు, స్మశాన వాటిక, యువత చదువుకోవడానికి గ్రంథాలయం, అంబేద్కర్ భవనం, వంటి అంశాల ౦ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులు చెప్పిన అంశాల ౦ విన్న స్పీకర్ గ్రామస్తుల ను ఉద్దేశించి మాట్లాడారు.

# అక్కడ ఇప్పటికీ చేదుడు బావులే దిక్కు!

- బంట్వారంలో ఏళ్ల తరబడి తాగునీటి కటకట
- పూర్తిస్థాయిలో అందని మిషన్ భగీరథ నీరు
- ఇంటికి 5 బిందెలు కూడా రావడం లేదని మహిళల ఆవేదన
- నల్లా కనెక్షన్లకు అక్రమ మోటార్లు
- జాడలేని మిషన్ భగీరథ అధికారులు
- ఎంతమంది సర్పంచ్‌లు మారినా పరిస్థితి ఇంతే



తాగునీటి కోసం కుళాయిల వద్ద నిరీక్షిస్తున్న స్థానికులు

**బంట్వారం. డిసెంబరు 28, ప్రభాతవార్త :** పొద్దున లేచింది మొదలు రాత్రి వరకు మంచినీరు లేనిదే పనులు సాగవు. మంచినీరు సమృద్ధిగా లభిస్తేనే యథావిధిగా రోజువారి పనులు చకచకా సాగుతాయి. ఈ ఊరిలో మాత్రం ఏళ్ళ తరబడి మంచినీటి సమస్య తలెత్తుతుంది. గతంలో నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని పెళ్లి సంబంధానికి ఆడ పిల్లను ఈ ఊరి పేరు చెబితే..ఇవ్వము అనే నానుడి కూడా ఉంది. ఇంత ప్రాచుర్యం పొందిన ఊరు ఏది అనుకుంటున్నారా..బంట్వారం మండల కేంద్రం. అదేంటి మండల కేంద్రంలో నీటి సమస్య ఉంటుందా అని నోరెళ్ళబెట్టవద్దు. నిజానికి నూరుపాళ్ళు ఉంటుంది. ఈ విషయం బంట్వారం గ్రామానికి చెందిన ఏ మహిళను కదిలించినా నీటి సమస్యపై నిట్టూరుస్తూ చెప్పేస్తుంది. బంట్వారం మండలం కర్ణాటక సరిహద్దుకు అతి చేరువుగా ఉండటంతో అభివృద్ధిలో వెనుకబాటులో ఉందని చెప్పక తప్పదు. ఇందులో భాగంగానే మండల అభివృద్ధికి ఎంతమంది నాయకులు వచ్చినా శీతకన్ను ప్రదర్శిస్తారు. బంట్వారం మండల కేంద్రంలో గత 30 సంవత్సరాల క్రితం ప్రధాన సమస్య మంచి నీటి సమస్యనే ఉండేది. అప్పట్లో గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న మంచి నీటి బావి, దుర్గమాత ఆలయ సమీపంలోని బావి, బీసీ వాడలలోని మంచినీటి బావిలో మాత్రమే తాగేందుకు నీళ్ళు లభించేవి. తదనంతరం ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, గ్రామ సర్పంచ్‌ల చొరవతో నీటి సమస్యను గట్టేక్కేందుకు కొల్లం బసవేశ్వరుని ఆలయ మార్గానికి వెళ్ళే దారిలో బోరు బావి, నల్లాల బావిని తవ్వించి మంచినీటి కొళాయిల ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేశారు. మరికొన్ని చోట్ల నీటి సమస్య ఎక్కువగా ఉన్న వార్డులలో అక్కడే బోరు బావులను తవ్వించి మంచినీటి సరఫరా చేశారు. దీంతో గ్రామంలో మంచి నీటి సమస్య 90 శాతం వరకు తీరింది. గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పైప్ లైన్ కనెక్షన్లు ఇంటింటికి ఇచ్చి నీటి సరఫరా చేశారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. గ్రామంలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చినప్పటికీ సరిపడా నీళ్ళు రావడం లేదని మహిళలు పేర్కొంటున్నారు. నల్లా కనెక్షన్ తీసుకున్న ఇంటికి కనీసం 20 బిందెల నీళ్ళు రావాలి. కనీసం 5 బిందెల నీళ్ళు కూడా రావడం లేదని మహిళలు వాపోతున్నారు. దానికి కారణం లేకపోలేదు. నల్లా సరఫరాలో పైప్ లైన్‌లో ఇంజనీరింగ్ అధికారులు వినియోగించే చెర్రాల వంటి సామాగ్రిని కొందరు తొలగించడం, మరికొందరు నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగించడంతో మిగతా వారికి సరిపడా నీళ్ళు సరఫరా కాలేకపోతున్నాయి. దీంతో గ్రామంలో అధికమంది మహిళలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక 30 ఏండ్ల క్రితం నాటి చేదుడు బావులమీదే ఆధారపడుతున్నారు.



మిషన్ భగీరథ నీళ్ళు సరిపడా రాకపోవడంతో చేదుడు బావిలోంచి నీళ్ళు తోడుకుంటున్న మహిళ